


దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లు భర్తీ చేయడానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు మార్చి 10వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శివ పూజకు వేళాయె

● నేడు మహాశివరాత్రి..ముస్తాబైన ఆలయాలు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి మహోత్సవం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. హరహర మహాదేవ అంటూ భక్తులు ఆ ముక్కంటికి ప్రత్యేక పూజలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సిద్దిపేటలోని మెదక్ రోడ్డులోని శ్రీ ఉమా పార్థివ కోటి లింగేశ్వర క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశారు. శివరాత్రి సందర్భంగా ఐదు రోజుల పాటు వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ తెలిపారు. సిద్దిపేట కరీంనగర్ రోడ్డులో ఉన్న శరభేశ్వరాలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. శివరాత్రి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ రెండు ఆలయాలకు భక్తులు వేలాదిగా తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఉమాపార్థివ కోటి లింగేశ్వరాలయం, శరభేశ్వరాలయ కార్యనిర్వహణాధికారి కందికోట రవికుమార్ తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లోని మరకత లింగేశ్వరస్వామి, సిద్దేశ్వరసామి ఆలయాలను దర్శించుకోనున్నారు.


ముస్తాబైన శ్రీ శరభేశ్వరాలయం
ఉమాపార్థివ కోటిలింగేశ్వరాలయంలోని స్వామివారు


కోటి లింగేశ్వరాలయం

సందడిగా మార్కెట్లు


సిద్దిపేట కల్చరల్/హుస్నాబాద్: శివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణాల్లో మార్కెట్లు సందడిగా మారాయి. పూలు, పండ్లు, కందగడ్డ, మారెడు పత్రి, బిల్వపత్రం గోగు పువ్వు కొనుగోళ్లతో రోడ్లన్నీ జనాలతో కిక్కిరిసిపోయాయి. రైతుబజార్, విక్టరీ చౌరస్తా, గాంధీ చౌరస్తా, అంబేడ్కర్ సర్కిల్, సుభాష్‌రోడ్డు, పాత మార్కెట్ రోడ్డు, హౌజింగ్ బోర్డు రద్దీగా కనిపించాయి. హుస్నాబాద్ మార్కెట్‌లో మట్టి దీప ప్రమిదలు జత రూ.60 చొప్పున, చిన్నదీపాలు రూ.5నుంచి రూ.30, కందగడ్డ కిలో రూ.40, సంత్రాలు కిలో రూ.100 చొప్పున విక్రయించారు.


సిద్దిపేటలో జనాలతో రద్దీగా మార్కెట్

శివరాత్రి వేడుకలకు ముస్తాబైన సంగారెడ్డి శివాలయాలు

● జగ్గారెడ్డి ఆధ్వర్యంలో లైట్లు, రంగులతో ఆలయాలకు ప్రత్యేక అలంకరణ


సంగారెడ్డిలోని రామ్‌మందిర్ వద్ద ఏర్పాటు చేసి విద్యుత్ లైట్లను పరిశీలిస్తున్న జగ్గారెడ్డి


రంగులతో ముస్తాబైన సంగారెడ్డి పట్టణంలోని సంగమేశ్వర ఆలయం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : శివరాత్రి వేడుకలకు సంగారెడ్డి పట్టణంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శివాలయాలకు లైట్లు, రంగుల వేశారు. జగ్గారెడ్డి ప్రత్యేక చొరవతో నాలుగు రోజులుగా దగ్గరుండి సంగారెడ్డిలోని పాత బస్టాండ్ సమీపంలోని సంగమేశ్వర ఆలయాన్ని మరమ్మతులు చేయించి, పూర్తిస్థాయిలో రంగులు వేయించారు. పట్టణ ప్రధాన దారులతో పాటు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివరాత్రి వేడుకల కోసం నేటి రాత్రి సంగీత విభావరి నిర్వహించనుండగా, గంజిమైదాన్‌లో ఏర్పాట్లు చేశారు. ప్రముఖ గాయకులు మనో, ఎస్పీ శైలజ తదితరులు విచ్చేయనున్నారు. ఏర్పాట్లను జగ్గారెడ్డి పర్యవేక్షించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, మహేశ్ముదిరాజ్, కిరణ్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రఘుగౌడ్, సుధాకర్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● కలెక్టర్ మనుచౌదరి


పాలమాకుల హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న సేవల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నంగునూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన హాస్టళ్లలో నాణ్యమైన సరుకులతో కూడిన ఆహారం వండి వడ్డించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం నంగునూరు మండలం పాలమాకుల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డార్మెటరీలలో విద్యార్థులు పడుకునేందుకు ఉపయోగిస్తున్న మంచాలు, పరుపులను పరిశీలించారు. డైనింగ్‌హాల్, వంటగదిని, స్టోర్ రూంలో ఉన్న పప్పులు బియ్యం, వంట సరుకులను చేతిలోకి తీసుకొని నాణ్యతను పరిశీలించారు. సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ తక్కువ క్వాలిటీ పంపిస్తే వెంటనే వాపస్ చేసి అధికారులకు సమాచారం అందించాలని హాస్టల్ వార్డెన్ గణేశ్‌కు సూచించారు. హాస్టల్ చుట్టూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. హాస్టల్ భవనం పైకప్పు అక్కడక్కడ పెచ్చులూడడం గమనించిన కలెక్టర్ స్పందించి వర్షాకాలంలో వాటర్ లీకేజ్ కాకుండా మరమ్మత్తులు చేయించాలన్నారు. సంబంధిత ఇంజనీర్‌తో తక్షణమే ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి హమీద్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట నంగునూరు తహసీల్దార్ సరిత తదితరులు ఉన్నారు.

రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలి

హుస్నాబాద్ : మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. మంగళవార హుస్నాబాద్ పట్టణంలో జాతీ రహదారి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు, మహిళా శక్తి భవన నిర్మాణానికి మండలంలోని జిల్లెలగడ్డ, ఉమ్మాపూర్‌లో స్థలాలను పరిశీలించారు.

ఆరవ వారం బుకింగ్
ఆదాయం రూ.45,64,495

చేర్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ వారాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలివచ్చి దండిగా మొక్కుబడులు, ఆర్జితసేవలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమర్పించిన మొక్కుబడులు, తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, విరాళాలు, ఇతరత్రా రూపంలో శనివారం రూ.3,67,625, ఆదివారం రూ.36,08,220, సోమవారం రూ.5,88,650, చొప్పున రూ.45,64,495ఆదాయం సమకూరింది. గతేడాది రూ.37.79 లక్షలు ఆదాయం సమకూరగా, ఈసారి సుమారు రూ.7.85 లక్షల మేర పెరిగింది.

నువ్వానేనా అంటూ హోరాహోరీగా సాగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. రేపు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఇటు పట్టభద్రులు, అటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీల గెలుపోటములను ప్రభావితం చేసే విషయంలో మెతుకుసీమ కీలకంగా మారింది. రెండు ఎమ్మెల్సీలకు సంబంధించి గడిచిన ఎన్నికలతో పోల్చితే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓట్ల సంఖ్య గణనీయంగా పెరగడమే అందుకు కారణం.

- ఉమ్మడి జిల్లాలో 70,713 మంది పట్టభద్రులు
- అత్యధికంగా ఉపాధ్యాయులు
- 7,249 మంది మనోళ్లే
- ఇక్కడివారి ఓట్లతోనే గెలుపోటముల ప్రభావం
- విస్తృతంగా కాంగ్రెస్, బీజేపీ ప్రచారం
- ధీటుగా బీఎస్పీ, స్వతంత్ర, సంఘాల అభ్యర్థులు
- ముగిసిన ఎన్నికల ప్రచారం.. రేపు పోలింగ్

మెతుకుసీమ కీలకం



మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల ఓట్లు

మొత్తం	3,55,159
పురుషులు	2,26,765
మహిళలు	1,28,392

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓట్లు

మొత్తం	27,088
పురుషులు	16,932
మహిళలు	10,156

ఎమ్మెల్సీ ఓటు ఇలా వేద్దాం 5

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 25 : మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ప్రక్రియ తుదిదశకు చేరింది. మంగళవారం సాయంత్రం అభ్యర్థుల ప్రచారం ముగిసింది. నేడు ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉండడంతో ఈ కాస్త సమయాన్ని కూడా అభ్యర్థులు సద్వినియోగం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఫోన్‌కాల్స్, వాయిస్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా ప్రతీ ఓటరును అభ్యర్థిస్తున్నారు. బరిలో 56 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు, 15 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు ఉండడంతో దాదాపు అందరి నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి.

గ్రాడ్యుయేట్ ఓట్ల వివరాలు

జిల్లా	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	40	8269	17,383	25652
మెదక్	22	3593	8879	12472
సిద్దిపేట	40	11002	21587	32589

టీచర్స్ ఓట్ల వివరాలు

జిల్లా	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	28	1170	1520	2690
మెదక్	21	548	799	1347
సిద్దిపేట	23	1192	2020	3212

పట్టభద్రుల్లో పోటాపోటీ

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు 70వేల పైచిలుకు ఉండడంతో అభ్యర్థులు ఈ దిశగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు తదితరులు పలుచోట్ల సభలు, సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ ఓట్లపై నరేందర్‌రెడ్డి, బీజేపీ పార్టీపై అంజిరెడ్డి విశ్వాసం పెట్టుకున్నారు. ఇక బీసీ, బడుగు బలహీన వర్గాల ఓట్లతోపాటు నిరుద్యోగుల ఓట్లు తనకు కలిసి వస్తాయని ప్రసన్న హరికృష్ణ భావిస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి బరిలో ఉన్నందున తనను గుర్తించాలని కోరుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, టీచర్ల హక్కుల కోసం పోరాడుతున్న ట్రస్మా నేత యాదగిరి శేఖర్‌రావు సైతం ధీటైన పోటీ ఇస్తున్నారు. కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ సైతం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓట్లు సాధించిన వారికే విజయావకాశాలు ఎక్కువగా

మిగతా 5వ పేజీలో

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

● విధుల్లో 250 మంది సిబ్బంది

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరగనున్న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికల సిబ్బందిని నియమించగా వారికి శిక్షణ సైతం అందించారు. జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మనుచౌదరి ఎప్పటికప్పుడు అధికారులతో ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. ఓటర్లందరికీ పోలింగ్ స్లిప్పులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. బ్యాలెట్ ద్వారా ఓటు వేయాల్సి ఉంటుండగా ఇప్పటికే అవగాహన కల్పించారు.



పోలింగ్ సిబ్బంది రెడీ..

జిల్లా పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 32,589 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 3,212 మంది ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు 250 మందిని సిబ్బందిని నియమించారు. పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు 40, ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు 23 ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఉపాధ్యాయ ఓటర్లు 166 మంది గాను 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ హయాంలో అన్నివర్గాల అభ్యున్నతి

● పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్

● మంత్రి పొన్నంతో కలిసి ఆలయాల్లో పూజలు

సిద్దిపేట కల్చరల్/కోహెడ ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందుతుందని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ అన్నారు. సిద్దిపేటలోని జిల్లా కేంద్రంలోని మహా రేణుకా ఎల్లమ్మ ఆలయం, రావిచెట్టు హనుమాన్ ఆలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ దర్శించుకున్నారు. ముందుగా రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రావి చెట్టు హనుమాన్ ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తొలిసారిగా సిద్దిపేటకు మహేష్ కుమార్ రావడంతో నియోజకవర్గ ఇన్‌చార్జి పూజలు హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. వీరితో పాటు రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తుంకుంట నర్సారెడ్డి, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



కోహెడలో టీ బ్రేక్..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట నుంచి కరీంనగర్ వెళ్తుండగా మార్గంమధ్యలో కోహెడ మండలం శనిగరం రాజీవ్ రహదారి ఉన్న ఒక హోటల్ వద్ద పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఉదయం టీ కోసం ఆగారు. కాసేపు కార్యకర్తలతో ముచ్చటించారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి వెంట కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు కర్ర రవీందర్ తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

సంగారెడ్డి రూరల్/మనోహరాబాద్/శివ్వంపేట/చిలప్‌చెడ్/హవేళిఘణపూర్/పుల్‌కల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలోని శైవక్షేత్రాలు వివిధ రంగులు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబయ్యాయి. సంగారెడ్డి పట్టణంలోని సంగమేశ్వరాలయం, సోమేశ్వరాలయం, రాజంపేటలోని రాజరాజేశ్వర ఆలయం, మండలంలోని కల్పగూర్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వరాలయం, పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి, శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు పురాతన గణపతి సమేత సోమేశ్వరాలయం, పెద్దగొట్టిముక్ల లోని ఉమా సంగమేశ్వరాలయం, శివ్వంపేటలోని శివాలయం, ఉమామహేశ్వర ఆలయం, చిలప్‌చెడ్ మండలంలోని చండూరు రామలింగేశ్వరస్వామి ఆలయం, హవేళిఘణపూర్ మండలం ముత్తాయికోటలోని సిద్ధేశ్వరాలయం, ఉమ్మడి పుల్కల్ మండలంలోని శివంపేట, మిన్‌పూర్, గొంగ్లూరు, పుల్కల్‌లో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాలు, కోర్పోలులోని శ్రీమహాదేవాలయం, చౌటకూర్‌లోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరాలయం, కోడూరులోని ఉమానాగలింగేశ్వరాలయం, ముదిమాణిక్యంలోని భోగేశ్వరాలయం,పెద్దారెడ్డిపేట, సింగూరు గ్రామాల్లోని శైవాలయాలను సిద్ధం చేశారు.


వివిధ రంగులతో ముస్తాబవుతున్న సంగారెడ్డి పట్టణంలోని సంగమేశ్వరాలయం

రెట్టింపైన పండ్ల ధరలు

సంగారెడ్డి రూరల్/తూప్రాన్/రామాయంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పండ్ల రేట్లు రెట్టింపయ్యాయి. గతంలో కిలో పుచ్చపండు రూ.15 ఉండగా.. ప్రస్తుతం రూ.20కి విక్రయిస్తున్నారు. ఆపిల్ రూ.100కు ఐదుఇవ్వగా.. ప్రస్తుతం రూ.100కు మూడు నుంచి నాలుగు ఇస్తున్నారు. అరటి పండ్లు డజన్(12)కు రూ.40 ఉండగా.. ప్రస్తుతం డజన్ రూ.100, సపోట కిలో రూ.80, ద్రాక్ష కిలో రూ.100, సంత్ర రూ.100లకు (5), రత్నపురి (కంద) గడ్డ రూ.40లకు కిలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉపవాస దీక్ష పండ్లతోనే విరమించేది కాబట్టి ధరలు అధికంగా ఉన్నా కొనుగోలు చేస్తున్నామని వినియోగదారులు తెలిపారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని రామాయంపేటలో వందకు పైగా పండ్ల దుకాణాలు వెలిశాయి. మంగళవారం సాయంత్రం దుకాణాలు జనంతో కిటకిటలాడాయి.

బ్యూవరైజ్ ట్యాంక్‌ను ఢీకొని కార్మికుడి మృతి


ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు, ప్రజాసంఘాల, పార్టీల నాయకులు, రాములు(ఫైల్)

కొండాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమ లోపల బ్యూవరైజ్ ట్యాంకు అద్దాలకు ప్రమాదవశాత్తు బైక్‌తో ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ వివరాల ప్రకారం.. మారేపల్లి గ్రామానికి చెందిన ఉత్తర్‌పల్లి రాములు(30) మల్లేపల్లి శివారులోని యూబీ బీరు పరిశ్రమల్లో 6న కార్మికుడి విధుల్లో చేరాడు. మంగళవారం ఉదయం 5:30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరాడు. పరిశ్రమ ఎదుట ఉన్న పార్కింగ్‌లో బైక్‌ను నిలపకుండా, మెయిన్ గేట్‌లో విధుల రిజిస్ట్రర్‌లో పేరును నమోదు చేయకుండా నేరుగా పరిశ్రమలో పల బ్యూవరైజ్ ట్యాంక్‌ను బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పరిశ్రమ యాజమాన్యం సంగారెడ్డి అసుపత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు తెలిపారు.

పరిశ్రమ ఎదుట ఆందోళన

రాములు మృతి విషయాన్ని తమకు చెప్పకుండా ఆస్పత్రికి తరలించడంపై సెక్యూరిటీ, యాజమాన్యంపై అనుమానాలను వ్యక్తం చేస్తూ.. కుటుంబసభ్యులు, గ్రామస్థులు, ప్రజా సంఘాల, వివిధ పార్టీల నాయకులు గేట్ ఎదుట ఆందోళనకు దిదిగారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేషం కలుగజేసుకొని పరిశ్రమ, యూనియన్ సభ్యులు, దాతల సహాయంతో మృతుని కుటుంబానికి రూ.5 లక్షల అర్థిక సహాయంతో పాటు మృతుడి పిల్లల చదువు, కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో మాజీ ఎంపీపీలు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, మనోజ్‌రెడ్డి, మాజీ సర్పంచులు పాండురంగం, వెంకటేశంగౌడ్ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్‌లో పడి ఒకరు..

కొండాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంక్‌లో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ వివరాల ప్రకారం.. గుంతపల్లి గ్రామానికి చెందిన మల్లేపల్లి మల్లేశం సోమవారం రాత్రి గ్రామంలో సరఫరా చేసే నీటి ట్యాంక్‌లో నీళ్లు నిండాయో.. లేదో చూసేందుకు పైకి ఎక్కాడు. నిచ్చెన సహాయంతో లోపలికి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు నిచ్చెన జారి నీటిలో మునిగి చనిపోయాడు. మృతుని భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

వెల్దుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అందుగులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అక్కమొల్ల గణేష్(40) సోమవారం ఉదయం 11 గంటలకు పొలం వద్ద నీరు పార పెట్టడానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం ఉదయం పొలం, చెరువు కట్ట వద్ద వెతుకుతుండగా చెరువులో ఉన్న సంపులో శవమై కనిపించాడు. గణేష్ కాళ్లకు, చేతులకు చేపల వల చుట్టుకుని ఉన్నది. గణేష్ మృతిపై అనుమానం ఉందని భార్య మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాపన్నపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి పారుదల ప్రాజెక్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఘనపూర్ ఆనకట్ట నీటిలో గుర్తు తెలియని యువకుడి(30) మృతదేహం ఉన్నదని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారమందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకుతీసి, మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి గురించి తెలిస్తే పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ నంబరులో 8712657930కు సంప్రదించాలని కోరారు.

ఔటర్‌రింగ్ రోడ్డుపై పోలీసు వాహనం బోల్తా

● సైబరాబాద్ పోలీసు సిబ్బందికి గాయాలు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పట్టణ శివారులో ఔటర్ రింగ్ రోడ్డు ముత్తంగి ఎగ్జిట్ వద్ద పోలీసు వాహనం బోల్తా కొట్టిన ఘటన మంగళవారంచోటు చేసుకుంది. పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి వివరాల ప్రకారం.. కంది జిల్లా జైలులోని ఓ ఖైదీని అదుపులోకి తీసుకునేందుకు సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు వాహనంలో బయలుదేరారు. వాహనంలో ఐదుగురు కానిస్టేబుళ్లు, డ్రైవర్ ఉన్నారు. ముత్తంగి జంక్షన్ సమీపంలోకి రాగానే వాహనం టైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఘనటలో వాహనంలోని నలుగురు కానిస్టేబుళ్లు, డ్రైవర్ గాయపడ్డారు. సిబ్బందిని హుటాహుటిన అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదస్థాయి తీవ్రంగా ఉన్నప్పటికీ సిబ్బందికి ప్రాణాపాయం తప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి పేర్కొన్నారు.


బోల్తాపడ్డ పోలీస్ వాహనం

రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వెల్దుర్తికి చెందిన కైలాష్ శ్రీనివాస్ అనే వ్యాపారి తన ఇంట్లో 1.8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశాడు. సమాచారమందుకున్న పోలీసులు బస్తాలను సీజ్‌చేసి, సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్‌కు, సిబ్బందికి అప్పగించారు. సీజ్‌చేసిన బియ్యాన్ని ఆటోలో సివిల్ సప్లయ్ గోదాముకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ తెలిపారు.


సిద్దిపేటలో పూజలు చేస్తున్న మహిళలు


సిద్దిపేట మార్కెట్‌లో సందడి



సంగారెడ్డిలోని వీరభద్రేశ్వరాలయం


హుస్నాబాద్‌లో..



శివోహం..

మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలు రంగురంగుల విద్యుత్ దీపాల్లో వెలిగిపోయాయి. కొన్ని చోట్ల మంగళవారం రాత్రి నుంచే సందడి నెలకొంది. మార్కెట్లు కిటకిటలాడాయి.




జహీరాబాద్‌లో..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

మృతుల్లో తల్లీకొడుకు, కోడలు


రోడ్డు ప్రమాదంలో చెల్లాచెదురైన మృతదేహాలు

మునిపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి బుదేరా చౌరస్తాలో మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఒకే బైక్‌పై వెళ్తున్న ఈ ముగ్గురిని గుర్తు తెలియని వాహనం ఢీ కొందా? లేక వేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీ కొని మృతి చెందారా అన్నది తేలడం లేదు. మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ కథనం ప్రకారం.. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పి. రవి(33), అతని తల్లి పి. లక్ష్మి(53), భార్య శోభారాణి(28)లు పని నిమిత్తం సదాశివపేటకు మంగళవారం రాత్రి ఒకే బైక్‌పై బయలుదేరారు. వీరి వాహనం బుదేరా చౌరస్తా వద్దకు రాగానే ప్రమాదం జరిగి ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురి మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. రాత్రి వేళ ప్రమాదం జరగడంతో అది ఏలా జరిగిందో ఎవరూ చూడలేదు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు పరిశీలిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రవికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకే ప్రమాదంలో తల్లీకొడుకు, కోడలు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెరువులో పడి ఇద్దరి దుర్మరణం


సునీల్‌గౌడ్, ప్రవీణ్ (ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ రాయరావు చెరువులో పడి ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఎస్సై లింగం కథనం ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన దుర్గప్పగారి సునీల్‌గౌడ్ (31), సార ప్రవీణ్(31) సోమవారం మధ్యాహ్నం ప్రవీణ్ బైక్‌పై తమ తమ ఇళ్ల నుంచి వెళ్లారు. సాయంత్రం వరకు కూడా ఇంటికి రాలేదు. వారి ఫోన్లు కూడా పని చేయకపోవడంతో కుటుంబీకులు అంతటా వెతికారు. మంగళవారం ఉదయం తప్పిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం చెరువులో రెండు మృతదేహాలు తేలి ఉన్న విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వెళ్లి పరిశీలించి, సునీల్ గౌడ్, ప్రవీణ్‌లుగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలు బయటపడ్డ ప్రాంతంలో చెరువు అలుగు వద్ద మద్యం సీసాలు ఉండటంతో మద్యం తాగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో ప్రవీణ్‌కు వివాహం అయి, ఐదేళ్ల కుమారుడు ఉండగా, సునీల్‌కు ఇంకా వివాహం కాలేదు. ప్రవీణ్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సునీల్‌గౌడ్ కులవృత్తి చేస్తున్నాడు.

కూడవెల్లి వాగులో పడి మరొకరు..

మర్కుక్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూడవెల్లి వాగులో కాలుజారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నరసన్నపేట గ్రామ శివారులో జరిగింది. ఎస్సై దామోదర్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన బొంత అంజయ్య(43) కొన్ని రోజుల క్రితం ఎలక్ట్రిక్ పోల్స్‌కి గుంతలు తీసేందుకు గ్రామానికి కూతురు భారతి కుమారుడు ఉదయ్‌తో కలిసి వచ్చారు. కూడవెల్లి వాగు వద్దకు మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లి కాలు జారి అందులో పడి, చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ సర్వీసెస్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపిక



కంది, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఆటల పోటీలకు కంది మండలం ఇంద్రకరణ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్.రమేశ్ ఎంపికయ్యారు. ఇటీవల హరియాణాలోని చండీగఢ్‌లో జరిగిన ఈ ఆటల పోటీల్లో 10 కిలోమీటర్ల పరుగు పందెంలో రమేశ్ ఫస్ట్ వచ్చారు. రెండు రోజుల క్రితం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అక్కడి రాజ్‌భవన్‌లో రమేశ్‌ను అభినందించారు. మంగళవారం సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.



- డ్రోన్లతో మందుల పిచికారి
- యాప్‌లతో వ్యవసాయం
- యువ రైతుల ప్రయోగాలు
- పెరుగుతున్న దిగుబడులు
- తగ్గుతున్న పెట్టుబడులు

సాగులో.. సాంకేతికత

వ్యవసాయం భారంగా మారి.. కాడి కింద పడేస్తున్న కాలంలో యువ రైతులు సాగును సాంకేతికతతో ముడిపెడుతున్నారు. ఇప్పటికే ఎన్నో పరికరాలతో వ్యవ'సాయం' చేస్తుండగా, ఇప్పుడు డ్రోన్ల లాంటి అత్యాధునిక పరికరాలను వినియోగిస్తున్నారు. సాగులో యాప్‌ల సాయం తీసుకుంటున్నారు. దీంతో పెట్టుబడులు తగ్గుతుండగా, దిగుబడులు పెరుగుతున్నాయి.

రామాయంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన యువ రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సాంకేతికతను వినియోగించి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఇందు కోసం డ్రోన్లను, యాప్‌లను, ఇతర పరికరాలను వినియోగించడంతో పాటు తోటి రైతులకూ సాయం చేస్తున్నారు. రామాయంపేటలో శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్లు పంటలకు పురుగు, తెగులు మందులను పిచికారి చేస్తున్నారు. మూడు వారాల క్రితమే సుమారు రూ. 20 లక్షల విలువైన డ్రోన్‌ను స్థానిక ప్రాథమిక సహకార సంఘానికి అందజేశారు. ఈ పరికరం సహాయంతో సుమారు వంద ఎకరాల్లో పురుగుల మందు చల్లే ప్రక్రియను చేపట్టారు.

యాప్‌ల సాయమూ..

వ్యవసాయంలో యువత డిజిటల్ మాధ్యమాలనూ వినియోగిస్తోంది. స్మార్ట్‌ఫోన్లలో పంటల సాగు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని, శాస్త్రజ్ఞుల సలహాలను తీసుకుంటూ వ్యవసాయం చేస్తున్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా శాస్త్రజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకుంటూ తాము పాటించడమే కాకుండా పొరుగు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది ప్రభుత్వం ఇజ్రాయిల్ దేశంలో సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి ఓ బృందాన్ని పంపగా, అందులో రామాయంపేట వ్యవసాయ సాహాయ సంచాలకులు రాజ్ నారాయణ సైతం ఉన్నారు. అక్కడ తెలుసుకున్న విషయాలను ఆయన ఇక్కడ రైతులకు సూచిస్తున్నారు. దీంతో రైతుకు శ్రమ, సమయం కలిసి రావడంతో పాటు కూలీల సమస్య తీరింది. పంట పెట్టుబడులూ తగ్గి, దిగుబడులు పెరిగాయి.


రామాయంపేటలో ఖర్జూర పండ్ల పంట

యువ రైతులే కీలకం



యువ రైతులు వ్యవసాయంలో ఆసక్తి కనబరుస్తున్నారు. మేమూ మునుపటిలా కాక నేటి అవసరాలకు అనుగుణంగా వివిధ పంటల సాగు మెలకువల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. రైతు నేస్తం, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సాగు పద్ధతులపై సందేహాలు నివృత్తి చేస్తున్నాం.

- రాజ్ నారాయణ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు

డిగ్రీ చేసి వ్యవసాయం వైపు..



డిగ్రీ పూర్తి చేసి కొత్త టెక్నాలజీతో పంట సాగుపై దృష్టి సారించా. దీనిలో భాగంగా ఢిల్లీకి వెళ్లి డ్రోన్ పైలట్ శిక్షణ తీసుకున్నా. నేను వ్యవసాయం చేసుకుంటూనే ఇతర రైతులకు డ్రోన్ ద్వారా తెగులు, పురుగుల మందు పిచికారి చేస్తున్నా. - శ్రీకాంత్, డ్రోన్ పైలట్

ఖర్జూర తోటలు

ఇంతకాలం జిల్లాలో వరి, మొక్కజొన్న తదితర పంటలు పండించిన పంటలు ఖర్జూర లాంటి పండ్ల తోటలనూ పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. రామాయంపేటకు చెందిన సత్యనారాయణ అనే రైతు అర ఎకరంలో ఖర్జూర పండ్ల తోటను సాగు చేస్తున్నారు. మరికొందరు రైతుల అరటి సాగు చేస్తున్నారు.

బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు

అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడంలేదు
ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్


మెదక్‌లో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, పక్కన మైనంపల్లి

మెదక్/నర్సాపూర్/చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను పోటీలో నిలుపకుండా బీజేపీకి మద్దతుగా లోపాయికారిగా పనిచేస్తోందని అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి విశ్వనాథ్ విమర్శించారు. మంగళవారం మెదక్‌లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అతిథి గృహంలో, నర్సాపూర్‌లోని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో, చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. ఆరు గ్యారెంటీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చుతున్నామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయని అభివృద్ధి కేవలం 14 నెలల కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసి చూపారన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు లాంటి దిగ్గజాల ప్రాతినిధ్యం వహించిన ప్రాంతం ఉన్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థి దొరకలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే 50వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే రికార్డు సృష్టించారన్నారు. పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు రోహిత్‌రావు, మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిహన్మంతరావు, మెదక్ పార్లమెంటు ఇన్‌చార్జి నీలం మధు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి , నాయకులు తొడుపునూరి చంద్రపాల్, అరుణార్తి వెంకటరమణ, బొజ్జపవన్ శర్మ, ఉప్పల రాజేష్, లింగం, లక్ష్మీనారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, మేడి మధుసూదన్‌రావు, శివరామకృష్ణ బూర్ల సచిన్, ఆంజనేయులు గౌడ్, గూడూరి కృష్ణ, కొండన్ సురేందర్‌గౌడ్, శ్రీనివాస్ చౌదరి పట్టభద్రులు పాల్గొన్నారు.

జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో సీఎం సోదరుడి పూజలు



సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన 1.08 కోటి రుద్రాక్షల శివలింగానికి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి కొండల్‌రెడ్డికి శివలింగం తయారీ విధానం, ఆలయ నిర్మాణ విశేషాలను వివరించారు. అనంతరం కొండల్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

నేరడిగుంటకు పీహెచ్‌సీ మంజూరు

జోగిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి దామోదర చొరవతో అందోలు మండలం నేరడిగుంటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కానున్నది. గత నెలలో దామోదర నేరడిగుంటను సందర్శించగా, అక్కడి ప్రజలు తమ గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కోరిక మేరకు పీహెచ్‌సీని ఏర్పాటుచేస్తానని మంత్రి మాటిచ్చారు. మంత్రి సూచన మేరకు కేవలం 25 రోజుల్లోనే ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రి చొరవతో రూ. 2.45 కోట్లు కూడా విడుదలయ్యాయి. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా చోంగ్తు జీఓ నెంబర్ 66 జారీ చేశారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌ను బహిష్కరించిన
డంప్‌యార్డ్ బాధితులు

జిన్నారం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంప్‌యార్డ్‌ను నిరసిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా గుమ్మడిదల, కొత్తపల్లికి చెందిన వారు జేఏసీగా ఏర్పడి 21 రోజులుగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జేఏసీ నాయకులు సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించాలని తీర్మానించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించి, దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, రైతులు, మహిళలు, విద్యార్థి నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మెతుకుసీమ కీలకం


3వ పేజీ తరువాయి

ఉండడంతో అందరి దృష్టి మెతుకుసీమపై పడింది. గత ఎన్నికల్లో 30వేల పైచిలుకు మాత్రమే పట్టభద్రుల ఓట్లు ఉన్నాయి. ఆ సంఖ్య రెట్టింపును మించడంతో ఇక్కడి పట్టభద్రుల తీర్పు కీలకంగా మారింది.

ఉపాధ్యాయుల ఓటెవరికో?

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 27వేల ఉపాధ్యాయుల ఓట్లు ఉండగా అందులో 7,289 ఓట్లు ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించినవే ఉన్నాయి. ఇందులో సిద్దిపేట జిల్లాలోనే 3,212 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. గతంలో పీఆర్‌టీయూ తరపున పోటీచేసి గెలిచిన రఘోత్తమరెడ్డి సిద్దిపేట వాసే. ఈసారి పీఆర్‌టీయూ సంఘం రఘోత్తమరెడ్డిని పక్కనబెట్టి వంగ మహేందర్‌రెడ్డికి అవకాశం కల్పించింది. ఇతర సంఘాలు, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘాల మద్దతు కూడగట్టుకున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా ఓటర్ల నమోదులో ఐదు నెలల నుంచే కీలకంగా ఉండడం తనకు కలిసి వస్తుందని, పెద్ద సంఘం కావడంతోపాటు అందరూ ఏకతాటిపై ఉన్నారని ఆయన ధీమాతో ఉన్నారు. అదే విధంగా బీజేపీతోపాటు అనుబంధ, ఇతర సంఘాల మద్దతుతో తానే విజయం సాధిస్తానని ఆ పార్టీ అభ్యర్థి మల్క కొమురయ్య భావిస్తున్నారు. టీపీటీఎఫ్ సంఘంలో కీలక నేత అయిన వై.అశోక్‌కుమార్ సైతం పలు జేఏసీల మద్దతును కూడగట్టి ప్రచారం చేస్తున్నారు. సిద్దిపేటకే చెందిన బడ్జెట్ పాఠశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి సైతం ప్రైవేట్ పాఠశాలలతోపాటు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తన నెలవారీ వేతనం కూడా పేద విద్యార్థులకు ఇస్తానని చెబుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న రఘోత్తమరెడ్డి కూడా పోటీలోనే ఉన్నారు. గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు.

ఎమ్మెల్సీ ఓటు ఇలా వేద్దాం..



కొండపాక, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకున్న వారు ఓటు వేసేందుకు అర్హులు. సాధారణ ఎన్నికల్లో ఓటు వేయడానికి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి తేడా ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలనేది కీలకం. ఈ విషయంలో అవగాహన కల్పించడం అధికారులు విఫలమయ్యారు. సరైన పద్ధతిలో ఓటు వేయకుంటే అది చెల్లకుండా పోయే ప్రమాదముంది. ఈ ఎన్నికల్లో మనకు నచ్చిన అభ్యర్థికి సరైన పద్ధతిలో ఓటు వేయడంతో పాటు అభ్యర్థులు నచ్చకపోతే నోటాపై ఓటు వేసే అవకాశమూ ఉంది. ఓటు ఎలా వేయాలో 'మీ కోసం..'

- ఇచ్చిన బ్యాలెట్ పేపర్ మీద అభ్యర్థుల పేర్లు, పార్టీ, అభ్యర్థి ఫోటో ఉంటాయి.
- మొదట ప్రాధాన్యం ఇచ్చే వారికి ఎదురుగా ఉన్న బాక్సులో 1వ నంబర్ వేయాలి.
- ఇతరులకు కూడా నచ్చిన ప్రాధాన్యత ఓటు కూడా వేయవచ్చు. అంటే ఇంకో అభ్యర్థికి కూడా ఓటు వేయాలనుకుంటే ఇప్పటికే 1వ ప్రాధాన్యత వినియోగించినందున ఈ అభ్యర్థికి రెండో ప్రాధాన్యం, మరో అభ్యర్థికి మూడో ప్రాధాన్యం ఇవ్వవచ్చు.
- పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్ మాత్రమే వాడాలి. సొంత పెన్ వాడకూడదు.
- ఓటు వేసేందుకు వెళ్లే సమయంలో గుర్తింపు కార్డులు తీసుకువెళ్లాలి. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన గుర్తింపు కార్డులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.
- పోలింగ్ బూత్‌లోనికి వెళ్లేముందు పేరు చూసుకుని సంతకం పెట్టాలి.
- బూత్ బయట ఓటర్ లిస్టులో పేరు క్రమసంఖ్య చూసుకోవాలి.

ఇలా చేయకూడదు..

- మీ సొంత పెన్ వాడకూడదు.
- అభ్యర్థులందరికీ ఒకటే ప్రాధాన్యత నంబర్ ఇవ్వకూడదు
- తెలుగులో ఒకటి అని రాయకూడదు. ఇంగ్లిష్‌లో కూడా వన్ అని రాయకూడదు. అంకెలోనే రాయాలి. ఉదాహరణకు 1
- బ్యాలెట్ పేపర్లో ఎక్కువ పేర్లు ఉంటాయి. ఆ పేర్లలో మీకు నచ్చిన వారికి 1వ నంబర్ వేయాలి.
- బ్యాలెట్ పేపర్ అక్కడి అధికారులు చెప్పే పద్ధతిలో మడత పెట్టి వేయాలి. లేదంటే మీ ఓటు ఇన్వాలిడ్ కింద లెక్క కడుతారు.
- ఖాళీగా పేపర్ వేయరాదు.
- మీరు ఇచ్చే నంబర్స్ గట్టిగా పెన్‌తో రుద్ద రాదు.
- అభ్యర్థి పేరు బాక్స్ పక్కన కాకుండా మరే ఇతర ప్రదేశాలలో ఓటు వేసినా ఓటు చెల్లదు.
- ఇచ్చిన బ్యాలెట్ పేపర్ నందు 1 ప్రాధాన్యత ఓటు వేయకుండా మిగతా నంబర్లు వేసినా ఓటు చెల్లదు.

పట్టభద్రుల పట్టం ఎవరికో?

పటాన్‌చెరులో 7,246 మంది ఓటర్లు
సంగారెడ్డి జిల్లాలో ఇక్కడే అధికం

పటాన్‌చెరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో అత్యధిక పట్టభద్రులు ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి నెలకొంది. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఇక్కడి పట్టభద్రులు అవగాహన లేక పెద్దగా ఆసక్తి చూపకపోయినా, వారిని ప్రసన్నం చేసుకునేందుకు బరిలో ఉన్న అభ్యర్థులు తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే, చాలా వరకు ఇక్కడి పట్టభద్రులకు అభ్యర్థులు ఎవరో కూడా తెలియకపోవడంతో వారు ఎవరికి పట్టం కడుతారో అన్నది ఆసక్తిగా మారింది.

7,246 మంది ఓటర్లు..

పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది పట్టభద్రులు ఉంటారని సమాచారం. అయితే, ఇక్కడ ఓటర్లుగా కేవలం 7,246 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. అది కూడా నాయకులు పట్టభద్రులను గుర్తించి, పట్టుబట్టి వారితో నమోదు చేయించారు. అమీన్‌పూర్, తెల్లాపూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రాంతాల్లోని వందల సంఖ్యల్లోని కాలనీలలో పెద్ద ఎత్తున పట్టభద్రులు ఉన్నారు. అయితే, వీరిలో చాలా మంది ఓటర్లుగా నమోదు చేయించుకునేందుకు ఆసక్తి చూపలేదు.

జోరుగా ప్రచారం..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు జోరుగా ప్రచారం చేశారు. ప్రధాన పార్టీల నాయకులు కాలనీల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. సోషల్‌మీడియా వేదికగా, ఎస్ఎంఎస్‌లు, ఫోన్లలో అభ్యర్థులు ఓటర్లను పలకరించారు. అధికార కాంగ్రెస్ నుంచి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి పారిశ్రామిక వేత్త అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి హరికృష్ణల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఈ ముగ్గురిలో పట్టభద్రులు ఎవరికి పట్టం కడుతారో వేచి చూడాల్సిందే.

ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్ ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా సేకరించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉదయం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, తాగునీటి సరఫరా సిబ్బంది హాజరును ఆయన పరిశీలించారు. పట్టణంలో కేటాయించిన వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేసే వారికి జరిమానా విధించాలన్నారు. పట్టణంలో ఎక్కడా శుభకార్యాలు జరిగిన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి వార్డులో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఫంక్షన్ హాల్ యజమానులు, నిర్వాహకులకు ప్లాస్టిక్ నిషేధంపై తప్పనిసరిగా సమాచారమందించి స్టీల్ బ్యాంక్‌లను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని వృథా చేయకుండా, నల్లాలకు మోటార్లను బిగించకుండా చూడాలని ఆదేశించారు.

వందశాతం పన్ను వసూలు చేయాలి

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నర్సయ్య

గజ్వేల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వందశాతం పన్ను వసూళ్లను పూర్తి చేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మునిపిపల్ కార్యాలయంలో మంగళవారం బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్సుల పన్నుల వసూలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను వసూళ్లతో పాటు ఇంటి నంబర్ లేని గృహాలు, వాణిజ్య సముదాయాలకు నెంబర్లను కేటాయించాలని సూచించారు. ప్రజలు ఇంటి పన్నులు, నల్లా బిల్లులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్, ఆర్ఐ, ఎస్ఐ, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీని విజయవంతం చేయాలి

● ఎంపీడీవో యాదగిరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరి.

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలో నిర్వహించే సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో యాదగిరి అన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 29 గ్రామాల్లో నాలుగు కోట్లతో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులకు ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఖాజా మొహినొద్దీన్, ఎస్ఆర్పీ స్వామి, డీఆర్పీలు శిరీష, మమత, రాజు, అనిల్, ఏపీవో శైలజ తదితరులు ఉన్నారు.



గజ్వేల్ : అష్టాదశ శక్తిపీఠ దేవాలయం

శివరాత్రికి ముస్తాబు



న్యూస్ నెట్‌వర్క్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి జిల్లాలోని ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. రంగులు వేసి, రంగురంగుల విద్యుత్ దీపాలను అలంకరించారు. ఆలయాల ఎదుట తోరణాలు ఆకర్షణగా నిలిచాయి. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ ఆలయాలకు భక్తులకు ప్రయాణ సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లోని లింగాలకొండపై వెలిసిన చంద్రమహేశ్వరస్వామి జాతర అత్యంత వైభవంగా జరుగనుంది. పందిల్ల గ్రామంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన మహాలింగేశ్వరస్వామి, కొండపాక శివారులోని అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమారామలింగేశ్వర స్వామి, తొగుట మండలంలోని రాంపూర్ కోటింగేశ్వరస్వామి, ఎల్లారెడ్డిపేట గ్రామంలోని త్రిలింగేశ్వరస్వామి, ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామీ హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో రాజేశ్వరస్వామి తదితర ఆలయాలు ముస్తాబయ్యాయి.



హుస్నాబాద్ రూరల్ : పొట్లపల్లిలో విద్యుత్ కాంతుల్లో...



వర్గల్ : శంభులింగేశ్వర స్వామి ఆలయం

దేశాభివృద్ధికి యువత కృషి చేయాలి

● అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్
● సందడిగా జిల్లాస్థాయి యువజనోత్సవం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధి కోసం యువత తమ శక్తియుక్తులతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో మంగళవారం కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వశాఖ, మేరా యువభారత్ నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పులమాల వేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సైన్స్ మేళా ప్రదర్శన, యువ రచయిత పోటీలు, యంగ్ ఆర్టిస్ట్, ఫోటోగ్రఫీ వర్క్‌షాప్ విభాగం, డిక్లేమేషన్ (వకృత్య విభాగం), బృంద నృత్య విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఎం.రంజిత్ రెడ్డి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా.శాంతి, సర్వ శిక్ష అభియాన్ ఏఎంవో బి. భాస్కర్, కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారులు సువర్ణ, శ్రద్ధానందం, రామచంద్రం, పున్నమ్మ, అతికం పవన్ కుమార్,



జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు

యూనియన్ బ్యాంకు ఆర్సెటి డైరెక్టర్ రాజలింగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించి పరీక్షలకు సిద్ధం కావాలి

దౌల్తాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని షేర్‌పల్లి పొందారం మొండిచింత వద్ద బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. మధ్యాహ్న భోజన మెనూ, వంటకాలను పరిశీలించారు. అదేవిధంగా శేరిపల్లి బందారం అంగన్వాడీ సెంటర్ 2ను సందర్శించి చిన్నారులతో మాట్లాడి పౌష్టికాహారంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, పీఆర్ఏ రాంకుమార్, ఎంఈవో గజ్జల కనకరాజు, పాఠశాల హెచ్ఎం స్రవంతి, డాక్టర్ నాగరాజు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ గిరిజ, ఏపీవో రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఐఈవో



బహుమతులు అందజేస్తున్న డీఐఈవో రవీందర్ రెడ్డి

కోహెడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ ఏడాది ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలుపాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు యాదగిరి, రాజమౌళి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రజిత, నీరజ, సీతారామయ్య, నరేష్, వెంకటరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవాలు..

గజ్వేల్ రూరల్/జగదేవపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలంలోని ముట్రాజ్‌పల్లి మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు డా. వన్నిసా పాఠశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. అలాగే జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 55వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ బానోతు రాజన్న, ఎంఈవో మాధవరెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా సైన్స్ ల్యాబ్స్ ఓపెన్ డే



ప్రయోగశాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ ల్యాబ్స్ ఒపెన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని ప్రయోగశాలలను పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు సందర్శించి ఆసక్తిగా తిలకించారు. వివిధ పరికరాలు, నమూనాలను వాటి పనితీరును విద్యార్థులకు వివరించారు. భౌతిక శాస్త్ర విభాగంలో పరావర్తనం వక్రీభవనానికి సంబంధించిన ప్రయోగాలు, వృక్షశాస్త్ర విభాగంలో కణజాల వర్ధనానికి సంబంధించిన పరికరాలు, రసాయన శాస్త్ర విభాగంలో విద్యార్థులకు గోల్డెన్ రెయిన్ చర్య, రసాయన ఊసరవెల్లి చర్య, నకిలీ రక్తం తయారుచేయడం వంటి అంశాలను ప్రదర్శించారు. జంతు శాస్త్రము ఫిషరీస్ విభాగాల ఆధ్వర్యంలో వివిధ నమూనాలు, చేపల కొలను ఆక్వా ఫోనిక్స్ విధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డా.పి అయోధ్య రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.సి హెచ్ మధుసూదన్, డా.ఎం. శ్రీధర్, డా. పవన్ కుమార్, డా. రాణి, డా. మహేష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా మర్పడగ క్షేత్రం

● డీఈవో శ్రీనివాస్ రెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భక్తి భావం పెంపొందించడంతోపాటు ఆధ్యాత్మిక కేంద్రంగా మర్పడగ క్షేత్రం విరాజిల్లుతుందని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత క్షేత్రంలో కృష్ణం వందే జగద్గురుమ్, రామం భజే శ్యామలం సంస్థల ఆధ్వర్యంలో విబుధ సంసర్గ మర్పడగ విజయదుర్గ అనే పుస్తకాన్ని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. ఏ వ్యాధులు లేని బంధమే ఆత్మీయ బంధం అని క్షేత్ర నిర్వాహకులు హరినాథ శర్మ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సంగీతం నరసింహారావు మంచినీళ్ల సరస్వతి, ఉండ్రాళ్ల రాజేశం ఉపాధ్యాయులు కవులు పుస్తక రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, డీఈవోను ఘనంగా సత్కరించారు.

'తపాస్‌పల్లి నుంచి నీటిని విడుదల చేయాలి'



వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తపాస్‌పల్లి నుంచి కొండపాక మండలంలోని గ్రామాలకు నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొండపాక, జగదేవ్‌పూర్ మండలాల్లోని అనేక గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

23 మందికి జరిమానా

గజ్వేల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి రూ.16,600 జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. మంగళవారం వారిని కోర్టులో హాజరుపరచగా విచారణ చేపట్టిన గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఈ మేరకు తీర్పును వెలువరించినట్లు పేర్కొన్నారు.

కాపర్‌వైర్ చోరీ

చేర్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి సోమవారం రాత్రి చేర్యాల మండలం ఆకునూరు గ్రామశివారులో మాసిరెడ్డిపల్లి కాలనీ, లింగాపూర్ వెళ్లే దారుల్లో పలు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను అపహరించుకుపోయారు. మంగళవారం ఉదయం వ్యవసాయబావుల వద్దకు వెళ్లిన రైతులు గమనించి విద్యుత్, పోలీసుశాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటకు నీరు పెట్టుకోకపోవడంతో ఇబ్బందులుపడాల్సి వస్తుందని రైతులు వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే బిగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు.

'విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి'

చేర్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవడంతోపాటు పటుదలతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను అన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల మోడల్‌స్కూల్ విద్యార్థులకు మంగళవారం సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, మహిళా చట్టాలు, బాల్య వివాహాలు, ఇతరత్రా అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రజలు కలిసి మెలిసి ఉండాలి

ధూళిమిట్ట, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులందరూ కలిసి మెలిసి ఉండాలని మద్దూర్ ఎస్సై షేక్ మహబూబ్ అన్నారు. మండలంలోని జాలపల్లి గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డం పెట్టుకొని గొడవలు సృష్టించవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి గ్రామస్థులు సహకరించాలన్నారు.

ఉచితంగా యోగా తరగతులు

కొండపాక, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం చేకూరతుఉందని ఆయుర్వేదిక్ వైద్యురాలు డాక్టర్ రజిని అన్నారు. మంగళవారం కొండపాక డిస్పెన్సరీ షెడ్‌లో యోగా శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అన్ని వయస్సులవారికీ ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నామ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీసీ కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న బాలలక్ష్మి

చేర్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి అన్నారు. చేర్యాల మునిసిపల్ కార్యాలయంలో బుధవారం ఎన్యూమరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో చేపట్టిన సర్వేలో నమోదు చేసుకోని వారి వివరాలను విధిగా సేకరించాలన్నారు. సర్వే నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. 100శాతం సర్వేను పూర్తిచేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేరే దిశగా కృషి చేయాలన్నారు.

కరాటే పోటీల్లో మిరుదొడ్డి విద్యార్థుల ప్రతిభ

మిరుదొడ్డి,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మిరుదొడ్డి మండల మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఎల్బీ ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించిన మిరుదొడ్డి మోడల్ స్కూల్ విద్యార్థులు హర్షిత, అక్షయ, శ్రేష్ట, రేవతి, సమీరా, సుస్మిత శ్రీజలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని, కరాటే మాస్టర్ శ్రీకాంత్, పీఈటీ దేవరాజు, కాంగ్రెస్ నాయకులు భూపాల్‌గౌడ్, భూమాగౌడ్ కనకారెడ్డి పాల్గొన్నారు.



సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

అక్రమ రిజిస్ట్రేషన్ చేయడం తగదు

● మునిసిపల్ మాజీ వెస్ చైర్మన్ దంపతుల ధర్నా



ఆందోళన చేస్తున్న మునిసిపల్ మాజీ వెస్ చైర్మన్ దంపతులు

చేర్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని తమ వారసత్వ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయడం తగదని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి దంపతులు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తాత మాజీమంత్రి నిమ్మ రాజిరెడ్డి 1979లో ఆకునూరు గ్రామంలో కొనుగోలుచేసిన భూమిని వీలునామా ప్రకారంగా తమవాటా వచ్చిన 8.34 ఎకరాల భూమిని తన బాబాయి నిమ్మ ప్రభాకర్‌రెడ్డి అక్రమంగా కాజేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విషయమై కోర్టులో దావా కొనసాగుతున్నప్పటికీ అధికార పార్టీ నేతల అండదండలతో నిమ్మ ప్రభాకర్‌రెడ్డి అతడి బంధువుపేరిట రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తున్నాడని పేర్కొన్నారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు కొంగరి వెంకట్‌మావోతో పాటు బీఆర్ఎస్ నేతలు మద్దతు తెలిపారు. ఆందోళన ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన విరమింపజేశారు.

బీఆర్ఎస్.. బీజేపీ మధ్య చీకటి ఒప్పందం : చాడ

హుస్నాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత వంటి కీలక నేతలున్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలపకపోవడంలో అంతర్యమేమిటని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగానే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలపలేదని ఆరోపించారు. హుస్నాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒకటీ రెండు మినహా ఇచ్చిన హామీలన్నీ అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో- ఆర్డినేటర్లు మేలక వీరన్న యాదవ్, దేగల సారయ్య, నాయకులు అశోక్, మల్లేష్, ప్రకాశ్, వీర సోమయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం రికార్డు

● టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు

గజ్వేల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 50వేల పైచిలుకు ఉద్యోగాలు కల్పించామన్నారు. వచ్చే ఆరు నెలల్లో లక్ష ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గజ్వేల్ కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవన్నారు. టీపీసీసీ కార్యదర్శి యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, పట్టణాధ్యక్షుడు రాజు, నాయకులు గోపాల్‌రావు, గంగిశెట్టి శ్రీనివాస్, కప్ప భాస్కర్ తదితరులున్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ ను పురస్కరించుకొని మంగళవారం సిద్దిపేట కోర్టు ఆవరణలో పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ స్వాతి రెడ్డి, పీపీలు, సీఐలు , ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం రాంసాగర్ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాములు శ్రీనివాస్(39) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ, మండల పరిషత్ సిబ్బంది పరామర్శించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలయ్య, ఎంపీవో శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రవి, సంతోష్, మల్లేశం, నర్సింహులు, రాజు, రామచంద్రం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 16 గొర్రెల మృతి

ములుగు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన ములుగులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి ఎక్కాల మల్లయ్య తన గొర్రెలను సోమవారం రాత్రి ఇంటి సమీపంలోని దొడ్డిలోకి తోలాడు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గొర్రెల మందపై దాడి చేయగా 16 గొర్రెలు మృతి చెందగా, మరో పది తీవ్రంగా గాయపడ్డాయి. రూ.3.20 లక్షలకు పైగానే నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.